క్లుప్తంగా...

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 17, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 20, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 55, మొరంగడ్డ 19, కందగడ్డ 28, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4-6, ముల్లంగి 3-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేటి మోదీ పర్యటనను విజయవంతం చేయాలి


బండ కార్తీకరెడ్డి

లాలాపేట: ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీక రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. శనివారం ఉదయం అధికారిక కార్యక్రమాల్లో భాగంగా సికింద్రాబాద్ రై ల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్-తిరుపతి వందే భా రత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవం, బీబీనగర్ లోని ఎయిమ్స్‌లో మౌలిక సౌకర్యాకల కల్పనకు శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం పరేడ్‌గ్రౌండ్‌లో జరుపతలపెట్టిన భారీ బహిరంగ సభలో తెలంగాణ ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

బీజేపీలోకి ఆదం విజయ్‌కుమార్


విజయ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం తుకారాంగేట్లోని ఆయన నివాసం నుంచి బైక్ ర్యాలీతో బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు డీకే. అరుణ, బూర నర్సయ్యగౌడ్, విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదం విజయ్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం, తుకారాంగేట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదం విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కేన్సర్ ఉచిత వైద్య శిబిరానికి స్పందన



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచా నెహ్రూ నగర్‌లో శుక్రవారం మహిళల కోసం నిర్వహించిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. సిగ్నిటి టెక్నాలజీస్ సహకారంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు కేన్సర్‌పై అవగాహన ఉచిత పరీక్షలు నిర్వహించారు.రఘు, సాయిరాం వేదం , మయూర్ పట్నాల, అనురాధ తదితరులు మాట్లాడారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పేదలకు ఉచితంగా వైద్య ఆరోగ్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో ప్రత్యేక గైనకాలజీ వార్డును ఏర్పాటు చేసి కేన్సర్ సేవలను అందిస్తున్నామన్నారు. డాక్టర్లు మిథున్, చక్రపాణి, రాజేష్, అపర్ణ, ఎస్‌ఆర్డీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరా భారతి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 'రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అవహస్యం చేసిందని' వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయటం బాధాకరమని ఆయనకు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎం.డీ. రియాజ్, బాలలక్ష్మీ, దేవేందర్, స్కైలాబ్ బాబు, మహేష్ బాబు, స్టాలిన్, కోల జనార్దన్, నీరటి కృష్ణ తదితరులున్నారు.


సనత్‌నగర్‌లోని మెథడిస్ట్ చర్చిలో..


తార్నాక ఐసోన్ చర్చిలో గీతాలను ఆలపిస్తున్న క్రైస్తవులు


సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చిలో.. గజ్జల నాగేష్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

గుడ్ ఫ్రైడేను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, నియోజకవర్గాల్లోని చర్చిల్లో శుభ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, కరుణ, త్యాగానికి ప్రతిరూపమైన దైవ తనయుడు క్రీస్తు భగవానుడు పాపుల రక్షణార్థమై శిలువ భారాన్ని మోసారని మత పెద్దలు ప్రబోధించారు. ఏ దోషమెరుగని సాధు గొర్రెపిల్ల లాగా క్రీస్తు శిలువపై రక్తం చిందించి ముక్తి మార్గం చూపించారన్నారు. కల్వరి కొండపై కార్చిన అమూల్యమైన రక్తం ప్రతి పాపిని శుద్ధపరిచి పావనపరుస్తోందని చెప్పారు. శిలువపై క్రీస్తు అందించిన చివరి ఏడు మాటలను భక్తులకు వివరించారు.

కాగా పలు చర్చిల్లో నాటకం రూపంలో 'శిలువ యాత్ర'ను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించి భక్తులను తరింపజేశారు. – సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


ఎర్రగడ్డ సెయింట్ థెరిస్సా చర్చిలో శిలువమార్గం నాటక ప్రదర్శనలోని ఓ సన్నివేశం


మౌంట్‌కార్మెల్ చర్చిలో.. మర్రి రాజశేఖర్‌రెడ్డి


బేగంపేట చీకోటి గార్డెన్స్‌లోని హోలీ ట్రినిటీ చర్చిలో..


అడ్డగుట్టలో..

బాలాంజనేయస్వామికి కరెన్సీనోట్ల అలంకారం



చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయ ఆలయ వార్షిక వేడుకలు రెండోవ రోజు కనుల పండువగా నిర్వహించారు. స్వామివారు పండ్లు, కరెన్సీనోట్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితులు మంత్రోచ్చారణ మధ్య సుప్రభాత సేవ, సింధూర అలంకరణ, నిజాభిషేకం, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం తమలపాకులు, పుష్పాలంకరణలో బాలాంజనేయుడు భక్తులకు దర్శనమిస్తాడని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, కేఆర్‌గాంధీ, గిరిధర్‌బాబు, రాధాకృష్ణశర్మ, రమేష్ చంద్ర, చంద్రకళ, స్వరూపరాణి, ఆంజనేయులు, సతీష్‌కుమార్, ప్రమోద్‌కుమార్, ఆలయ అర్చకులు ఫణిశర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

అమీర్‌పేట: ప్రభుత్వ ఆస్పత్రులు ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయల సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అమీర్‌పేటలోని 50 పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు, మజ్జిగ, నాలుగు రకాల హార్లిక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ... నూతనంగా నిర్మించిన ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, వార్డుల నిర్వాహణ అద్వితీయంగా ఉందన్నారు. సేవాసమితి వ్యవస్థాపకుడు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ... పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు నిత్యం కొద్దిపాటి వ్యాయామం చేయాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దశరథ్, డాక్టర్ వినాయక్, సేవా సమితం ప్రతినిధులు అద్దంకి హేమలత, విజయశ్రీ, మోర్ల అమరేశ్వరి, నాగరేఖ పాల్గొన్నారు.


రోగులకు పండ్లు అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్, ఆర్‌సీ కుమార్

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి మహర్దశ పట్టింది. శుక్రవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యధునిక కంప్యూటర్‌ల ల్యాబ్‌ను ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి దేశ విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు అధికంగా సహాయం అందిస్తున్న విషయం విధితమే. పది రోజుల క్రితం కోల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ అధికారులైన పూర్వవిద్యార్థులు కొత్తగా స్థాపించిన మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది వేతనాలకు విరాళంగా రూ.3 కోట్లను డిపాజిట్ చేసిన విషయం విధితమే. పూర్వ విద్యార్థులతో పాటు అమెరికాకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థకు దరఖాస్తు చేసుకోగా సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అమెరికాకు చెందిన ఎస్ అండ్ పీ గ్లోబల్ కంపెనీ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూ హెచ్) అనే అంతర్జాతీయ ఎన్‌జీఓ ద్వారా ఇంజినీరింగ్ కాలేజీకి 76 అత్యధునిక 13 జనరేషన్ కంప్యూటర్లతో పాటు 48 బ్యాటరీలు, 2 యూపీఎస్, 2 వీడియో కాన్ఫరెన్స్ కిట్లు స్మార్ట్ బోర్డులు, ఇంజినీరింగ్ 41 మంది విద్యార్థినులకు ఫెలోషిప్‌లను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు.


ఎన్‌జీఓ ప్రతినిధులతో ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ ఎగ్జిబిషన్

పద్మారావునగర్: వేసవిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కళాసిల్క్ ఎగ్జిబిషన్ వినియోగదారుల మన్ననలు అందుకుంటోందని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు వినోద్ పేర్కొన్నారు. కొతాకామకోటి కల్యాణ నిలయం, పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో సమ్మర్ స్పెషల్ వస్త్రాలు కొనుగోలు చేసి ధరించి ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. వీటికి అనుగుణంగా అన్ని సీజన్‌లలో ధరించే వివిధ రకాల కాటన్‌చీరలు, చేనేత వస్త్రాలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి తయారైన చేనేత వస్త్రాలు, బెడ్‌షీట్‌లు, కవర్లు, వివిధ కళాకారులు చేతితో తయారు చేసిన బొమ్మలు, వివిధ రకాల వస్తువులు లభిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన మరో మూడు రోజులు మాత్రమే కొనసాగుతుందని వినోద్ తెలిపారు.


కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న మహిళలు

రూ.5.40 లక్షలతో అభివృద్ధి పనులు

అంబర్‌పేట: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం గోల్నాక శంకర్‌నగర్‌లో రూ.5.40 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశలవారిగా తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రెడ్డి కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేసి ఆ హామీని నిలబెట్టుకోవాలని రెడ్డి ఐక్య కార్యాచరణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం పార్క్‌లేన్‌లోని కార్యాలయంలో కమిటీ సమావేశంలో పైళ్ల హరినాథ్‌రెడ్డి, తుమ్మల మధుకర్‌రెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి, పిసరి మల్లారెడ్డి, పడమటి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, పల్లెర్ల రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి ఆనంద్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొని పలు తీర్మాణాలు చేశారు. రెడ్డి కార్పొరేషన్‌ను ఈ నెల 8వ తేదీన సిద్దిపేటలో, 23వ తేదీన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే రెడ్ల ఆత్మీయ సమ్మేళనాలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు సూచించారు.

కోలాహలంగా పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు


పద్మారావుగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత వేణుమాధవ్


చీరలు పంపిణీ చేస్తున్న అడవయ్య ట్రస్టు చైర్మన్ ర్యాల రాజేందర్‌యాదవ్


స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఓడియన్ శ్రీనివాస్, అశోక్‌గౌడ్

సికింద్రాబాద్: శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పద్మారావు నివాసానికి వచ్చిన పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు పద్మారావుగౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆంకాంక్ష క్యాటరింగ్ అధినేత ఏ.వేణుమాధవ్‌తోపాటు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. సుమారు 1000 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరయ్యారు. మేడిబావిలోని రెయిన్‌బో అనాథ ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు తీగుళ్ల కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. అడవయ్య చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు ర్యాల రాజేందర్‌యాదవ్ నేతృత్వంలో పేద మహిళలకు చీరల పంపిణీ జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై జరిగిన వేడుకల్లో పద్మారావుగౌడ్ అభిమానులు, బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై డిప్యూటీ స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

బన్సీలాల్‌పేట్: డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌కు బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు తలసాని సాయికిరణ్ యాదవ్ శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోండా మార్కెట్ టకారబస్తీలోని ఆయన నివాసంలో పద్మారావును సాయికిరణ్ కలిశారు. డిప్యూటీ స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


పద్మారావుగౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సాయికిరణ్ యాదవ్

ఘనంగా దత్తసాయి ఆలయ వార్షికోత్సవాలు


పూజల్లో పాల్గొన్న దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి తదితరులు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి టెంపుల్ ఆవరణలో ఉన్న ఆనంద దత్త సాయి ఆలయ చతుర్థ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈఓ విఠలయ్య, చందన్‌సింగ్‌ల పర్యవేక్షణలో రెండు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నక్షత్ర జన్మ జాతక దోష నివారణ హోమం, సాయి భజనలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. బేగంపేట ప్రకాష్‌నగర్, వికార్‌నగర్, పాటిగడ్డ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు



లాలాపేట: హాస్పిటల్ కోసం మాణికేశ్వర్‌నగర్ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మూడో రోజు బస్తీవాసులు పలువురు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంత కాలం ఓయూ భూములు ఆక్రమణకు గురికాకుండా వడ్డెర బస్తీ వాసులమే రక్షణగా ఉన్నామన్నారు. తమ బస్తీలో హాస్పిటల్ ఏర్పాటు కోసం గతంలో కేటాయించిన స్థలాన్ని తమ స్థలం అంటూ ప్రస్తుతం ఉన్న ఓయూ అధికారులు అడ్డుపడటం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని ఓయూ అధికారులతో మాట్లాడాలని కోరారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రూపాని సత్యనారాయణ, లత తదితరులు సాయంత్రం నిమ్మరసంతో దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఓర్సు శేఖర్, గండికోట విజయ్ కుమార్, ఆలకుంట లింగయ్య తదితరులున్నారు.